విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్‌కేజీ నుంచి పీయూసీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఉచిత ప్రయాణం వర్తించనుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హాజరు పెరగడంతోపాటు గుణాత్మకమైన విద్య అందించేందుకు ఉచిత ప్రయాణం అనుకూలం కానుందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం విద్యార్థులకు అనుకూలం కావాలనే వెసులుబాటు కల్పించినట్టు డీసీఎం డీకే శివకుమార్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

- ఏళ్ల తరబడి చదువుతున్నా రికార్డులు లేవు
- ఐటీ నగరి, కాఫీ తోటలకు వలసలు

కర్ణాటకలో ఈశాన్య రాష్ట్రాల.. పిల్లలు..!



బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఐటీ నగరిగా పేరొందిన బెంగళూరులో వందలాది బహుళజాతి సంస్థల కార్యాలయాలు, వేలకొలదీ ఐటీబీటీ సంస్థలతోపాటు ప్రైవేటు కార్యాలయాలు వెలిశాయి. నిర్మాణరంగం నిరంతరం కొనసాగుతోంది. పనిచేసేవారికి నగరంలో ఎక్కడైనా అవకాశాలు సాధ్యమవుతాయి. ఇక పశ్చిమ కనుమలకు అనుబంధమైన నాలుగైదు జిల్లాల్లో విస్తారంగా కాఫీతోటలు ఉన్నాయి. లక్షలాది ఎకరాలలో ఉండే కాఫీతోటలలో పనిచేసేందుకు కూలీల అవసరం ఉంది. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వేలాది కుటుంబాలు ఉపాధికోసం రాష్ట్రానికి వలసలు వస్తుంటాయి. ఏడాది పొడవునా ఇక్కడే గడుపుతారు. వారు నివసించేందుకు చిన్నపాటి ఇల్లు సమకూరిస్తే అందులోనే కుటుంబీకులంతా సేద తీరుతారు. వారికి పని గంటలు ఉండవు. పరోక్షంగా చెప్పాలంటే దశాబ్దాలకాలం కిందట వెట్టిచాకిరీ తరహాలోనే వీరు పనిచేస్తారు. ఏడాదికోసారి మాత్రమే సొంత రాష్ట్రాలకు వెళ్తారు. రోజుకు 14-18 గంటలు పని చేస్తారు. ఇలా వలసవచ్చినవారి పిల్లలు ఇక్కడే నివసిస్తుంటారు. వారి చదువులు ఇక్కడే కొనసాగుతుంటాయి. అయితే ఎక్కడా రికార్డులు ఉండవు.


బాగేపల్లిలో గుర్తించిన మేఘాలయ విద్యార్థినులు (ఫైల్)

ఉపాధి కోసం దక్షిణ భారత్ వైపు..

పేదరికం కారణంతో ఉత్తర, ఈశాన్య భారత్ నుంచి ఉపాధి పనుల కోసం దక్షిణభారత్‌వైపు వస్తారు. అందులో కర్ణాటకకే ఎక్కువమంది వస్తుంటారు. ఈశాన్య రాష్ట్రాలలో నివసిస్తున్నవారు కూడా ఉపాధి, కూలీ పనులతోనే జీవనం సాగిస్తుంటారు. వారు పిల్లలను పెంచడం కూడా కష్టంగానే ఉంటుంది. ఇక ప్రమాదాలు, వ్యసనాలతో తల్లిదండ్రులలో ఒకరు చనిపోతే ఆ పిల్లలు అనాథలుగా మారిపోతారు. ఇటువంటి పిల్లలు రాష్ట్రానికి ఏటా వస్తుంటారు. రాష్ట్రంలోని వివిధ మఠాలు, ఆశ్రమాలు, ట్రస్టులు నిర్వహించే రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆశ్రయం పొందుతున్నారు. అయితే వారి వివరాలు ఎక్కడా నమోదు కావు. ప్రధానంగా మేఘాలయ, నాగాల్యాండ్, మణిపూర్ రాష్ట్రాలనుంచి ఎక్కువమంది పిల్లలు రాష్ట్రానికి వస్తున్నారు. అక్కడి ఎన్జీఓలతోపాటు సామాజిక సేవా సంస్థలు పేద కుటుంబాల పిల్లలను గుర్తించి రాష్ట్రానికి తీసుకొచ్చి వివిధ మఠాలు, ఆశ్రమాలు, ట్రస్టులకు అనుబంధమైన పాఠశాలల్లో చేరుస్తున్నారు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలు కర్ణాటకలో ఎక్కడ ఉన్నారనేది స్పష్టంగా తెలియదు. కానీ వేసవికాలంలో సొంతూళ్లకు తీసుకెళ్తారు. తర్వాత విద్యాసంస్థలు ప్రారంభం కాగానే తిరిగి తీసుకొస్తారు. ఇదే తరహాలోనే ఉపాధి పనులకు వచ్చిన వారి పిల్లలు కూడా మఠాలు, ఆశ్రమాలకు అనుబంధమైన రెసిడెన్షియల్ స్కూళ్లలో చేరుతున్నారు.

గ్రాంటుకోసమే కొన్ని స్వచ్ఛంద సంస్థలు!

కొన్ని మఠాలు, ఆశ్రమాలు, సామాజిక బాధ్యతతో అటువంటి చిన్నారులకు పదో తరగతి దాకా ఉచితంగా హాస్టల్‌తోపాటు ఉత్తమ విద్యను అందిస్తున్నారు. కానీ కొన్ని ట్రస్టులు ప్రభుత్వ గ్రాంట్లను పొందేందుకు ఈశాన్యరాష్ట్రాల పిల్లలను వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా ఎంతమంది విద్యార్థులు చదువు పూర్తి చేస్తారనేది, తిరిగి వెళ్తారనేది కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర సమాచారం ఉండదు. ప్రభుత్వం ఇతర రాష్ట్రాల పిల్లలు చదువుకు వస్తే వివరాలను సింగిల్ పోర్టల్‌లో నమోదు చేయాలి. పిల్లల ఇంటి అడ్రస్, పాఠశాల, లేదా రెసిడెన్షియల్ స్కూల్ వివరాలు పొందుపరచాలి. ఇతర రాష్ట్రాల పిల్లలను చేర్చేముందు ప్రాంతీయ విద్యాశాఖ అధికారులు, సదరు సంస్థల అనుమతులు, సౌకర్యాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించాలి. ప్రభుత్వ గ్రాంటుకోసమే పనిచేసే ట్రస్టులు, ఆశ్రమాల కార్యకలాపాలపై విద్యాశాఖ ద్వారా పర్యవేక్షించాలి.

ఎన్నెన్నో ప్రమాదాలు..

మండ్య జిల్లా మళవళ్లి తాలూకా రెసిడెన్షియల్ స్కూల్‌లో స్థానిక వ్యక్తి జన్మదిన వేడుకలు జరిగాయని, బయటనుంచి తీసుకొచ్చిన ఆహారం తిని మేఘాలయకు చెందిన ఇద్దరు పిల్లలు మృతి చెందారు. 22మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. అప్పటివరకు ప్రభుత్వానికి మేఘాలయ పిల్లలు ఇక్కడ చదువుతున్నానే విషయమే తెలియదనేది స్పష్టమైంది. జాతీయ స్థాయిలో ఈ అంశం చర్చకు కారణం కాగా మేఘాలయ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల బృందం పిల్లలను తిరిగి తీసుకెళ్లారు. ఇటీవల శివమొగ్గ జిల్లాకు అనుబంధమైన ఓ మఠంలో మేఘాలయకు చెందిన ఓ మఠంలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవనే విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు పిల్లలను రక్షించారు. పిల్లలకు మఠంలో సౌకర్యాలు కల్పించామని రుజువు చేశాక మళ్లీ వారిని మఠాలకు పంపారు. ఈ రెండు సంఘటనల్లోనూ స్వచ్ఛంద సంస్థలు, పిల్లల తల్లిదండ్రులతో అంగీకారపత్రం రాయించుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. సమస్య తలెత్తినప్పుడు మాత్రమే ప్రభుత్వ దృష్టికి సమస్య చేరుతుంది. లేదంటే అడిగేవారే ఉండరు. తాజాగా చిక్కబళ్లాపుర జిల్లా బాగేపల్లి పరిధిలోని ఓ ట్రస్టులో 25మంది మేఘాలయ పిల్లలు ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది.

స్వచ్ఛంద సంస్థలకు ఆదాయ మార్గం

పిల్లల విద్య, వారి హక్కుల రక్షణ విషయంలో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించకపోవడం, సంబంధితశాఖలు సమన్వయం లేకపోవడం వంటి కారణాలతో ఈశాన్య రాష్ట్రాల పిల్లలతో పలు ట్రస్టులు ఏటా లక్షలాది రూపాయలు ఆదాయాన్ని గడిస్తున్నాయి. పిల్లల ముసుగులో సంపాదన లక్ష్యంగా పెట్టుకున్న సంస్థలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

బీజేపీపై ప్రకటనల వివాదం
సీఎంకు హైకోర్టులో ఊరట



బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లక్రితం శాసనసభ ఎన్నికల వేళ బీజేపీపై ప్రకటనలు జారీ చేసిన వివాదంలో సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు నుంచి తాత్కాలిక ఊరట లభించింది. ఇదే కేసులో డీసీఎం డీకే శివకుమార్, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపితులుగా ఉన్నారు. శుక్రవారం హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఆర్ కృష్ణకుమార్ మధ్యంతర స్టేను విధించారు. ఎన్నికల ప్రచారం వేళ బీజేపీ ప్రభుత్వం 40శాతం కమీషన్, వివిధ హోదాలకు అవినీతి ధరలు అంటూ పలు పత్రికలలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రకటనలు జారీ చేశారు. వాటిపై బీజేపీ ప్రజాప్రతినిధుల కోర్టులో క్రిమినల్, పరువునష్టం కేసును నమోదు చేశారు. అయితే సీఎం సిద్దరామయ్య ఈ కేసునుంచి ఉపశమనం కల్పించాలని, కేసును రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణ జరిపిన ధర్మాసనం మధ్యంతర స్టేను విధించింది.

వీధికుక్కలకు మాంసాహారం

- బెంగళూరు పాలికెలో రూ.2.88 కోట్ల అంచనా



బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సిలికాన్ సిటీ బెంగళూరులో వీధి కుక్కలకు మాంసాహారం అందించేందుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె టెండర్లు ఆహ్వానించింది. 8 ప్యాకేజీలుగా విభజించి టెండర్లను ఆహ్వానించారు. రూ.2.88 కోట్లు ఖర్చు చేసేందుకు అంచనా వేశారు. వీధి కుక్కలు దాడులు పెరుగుతున్న తరుణంలో వాటికి పౌష్టిక ఆహారం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి డివిజన్‌లోనూ 500 కుక్కలకు ఉదయం లేదా సాయంత్రం ఆహారం అందించేలా నిర్ణయించారు. ఉదయం 6 నుంచి 11 గంటలు లేదా రాత్రి 8 నుంచి 11 గంటల మధ్యలో ఇవ్వాలని బీబీఎంపీ అధికారులు నిర్ణయించారు. ఇటీవలే కుక్కర్ తిహార్ పేరిట వీధికుక్కలకు ఆహారం అందించే పథకం ప్రారంభించారు. ఇందుకు అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లు, కాలనీల సంఘాలు, హోటల్, రెస్టారెంట్ల యజమానుల సహకారం కోరారు. అయితే ఏ వర్గం నుంచి స్పందన లేకపోవడంతో కుక్కర్ తిహార్‌ను వదిలేశారు. బీబీఎంపీలో 2.80లక్షల వీధికుక్కలు ఉన్నాయి. కొన్ని చోట్ల వీధికుక్కలకు ఆహారం లభించక జనంపై దాడి చేస్తున్నట్టు గుర్తించారు. అందుకే పాలికె ద్వారానే ఆహారం అందించాలని నిర్ణయించినట్టు బీబీఎంపీ స్పెషల్ కమిషనర్ (పశుసంవర్ధనా విభాగం అధికారి) సురల్కర్ వికాస్ కిశోర్ తెలిపారు. 8 డివిజన్‌లలో ప్రయోగాత్మకంగా 4వేల వీధికుక్కలకు ఆహారం ఇవ్వదలిచారు. ప్రతి డివిజన్‌లోనూ 100 స్థలాలను గుర్తించారు. ప్రతి స్థలంలోనూ టెండరు పొందినవారు కుక్కలకు అహారం అందించాల్సి ఉంటుంది. వీధికుక్కలకు 750 కేలరీల పౌష్టికాహారం అవసరం కానుంది. ఈ నిబంధనలకు అనుగుణంగా చికెన్‌రైస్, కోడిగుడ్లు, లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వాలని ఉంది. ప్రతి డివిజన్‌లో వీధికుక్కలకు ఆహారం సమకూర్చేందుకు రూ.36 లక్షలు కేటాయించనున్నారు.

ఏ పార్టీలో ఉండాలనేది ప్రజలే నిర్ణయిస్తారు

- ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ



బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఏ పార్టీలో ఉండాలనేదిగానీ, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనేదిగానీ నియోజకవర్గ ప్రజలే నిర్ణయిస్తారు కానీ పోటీ చేయడం మాత్రం తథ్యమని చాముండేశ్వరి ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ స్పష్టం చేశారు. మైసూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జేడీఎస్ ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. పార్టీ ప్రముఖ నేతలతో సరిపడక దూరంగా ఉన్నానన్నారు. జేడీఎస్‌లో కొనసాగాలా లేదా బీజేపీ, కాంగ్రెస్‌లలోకి వెళ్లాలా అనేది ప్రజలు తీర్మానిస్తారన్నారు. కాంగ్రెస్‌లోకి రావాలని సీఎం సిద్దరామయ్య లేదా డీసీఎం డీకే శివకుమార్ పిలవలేదన్నారు. బీజేపీ నాయకులు కూడా ఆహ్వానించలేదన్నారు. జేడీఎస్ వారు ఇటీవల జరిగిన చన్నపట్టణ ఎన్నికలకు పిలవలేదన్నారు. పార్టీ ప్రణాళికా సంఘం అధ్యక్షుడినైనా ఎవరూ ఆహ్వానించలేదన్నారు. నా రాజకీయ భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుందన్నారు. సిద్దరామయ్య లాంటి బలమైన నాయకుడిపైనే గెలిచానన్నారు. కానీ కుమారస్వామి, సురేశ్‌బాబుకు శాసనసభలో పార్టీపక్షనేత అవకాశం ఇచ్చారన్నారు. అందుకే ఎమ్మెల్యేగా నా నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్నా అన్నారు. నిఖిల్ కుమారస్వామి మూడు ఎన్నికల్లో ఓడారని, అయితే పార్టీని ముందుకు తీసుకెళ్లే సత్తా ఉందన్నారు.

గ్రామీణ విద్యార్థుల నైపుణ్యతకు ‘బెస్ట్’

- పీఈఎస్‌లో సెంటర్‌పై మంత్రి శరణప్రకాశ్ పాటిల్


పీఈఎస్ ‘బెస్ట్’ కేంద్రంలో మంత్రి శరణప్రకాశ్ పాటిల్

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత ఇంజనీరింగ్, డిప్లమో విద్యార్థులకు నైపుణ్యత పెంచడంకోసం పీఈఎస్ యూనివర్సిటీలో బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) సెంటర్ కొనసాగింపు అభినందనీయమని రాష్ట్ర వైద్య విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి శరణప్రకాశ్‌పాటిల్ అన్నారు. శుక్రవారం పీఈఎస్ యూనివర్సిటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చాన్సలర్ జవహర్ దొరస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధికోసం బెస్ట్ సెంటర్ కొనసాగింపు సంతోషమన్నారు. ఉత్తర కర్ణాటక జిల్లాలకు చెందిన డిప్లొమో, ఇంజనీరింగ్ విద్యార్థులకు బెస్ట్ ద్వారా నైపుణ్యం కల్పించడం, వారి ఉద్యోగాలకు అనుకూలం కానుందన్నారు. జవహర్ దొరస్వామి మాట్లాడుతూ ఇది కేవలం నైపుణ్యత అందించే కేంద్రం కాదని అట్టడుగు వర్గాలలో చైతన్యం తీసుకొచ్చేలా శిక్షణలు ఇస్తున్నామన్నారు. పీఈఎస్‌లో చదివే విద్యార్థులతో సమానంగా ఉత్తర కర్ణాటక ప్రాంత గ్రామీణ విద్యార్థులకు నైపుణ్యతతో ఉద్యోగాలు దక్కాలనేది మా ఆశయమన్నారు. బజాజ్ ఆటో సీఎస్ఆర్ విభాగం వైస్‌ప్రెసిడెంట్ సుధాకర్ గుడిపాటితో పాటు సంసేర ఇంజనీరింగ్ ఎండీ ఎఫ్ఆర్ సింఘ్వి, వైస్‌చాన్సలర్ డాక్టర్ సూర్యప్రసాద్, సీఓఓ డాక్టర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కళల పట్ల ఆసక్తి పెంచుకోవాలి
విద్యార్థులకు బళ్లారి నగర మేయర్ సూచన
8

డీకే శివకుమార్


- రెండేళ్లుగా నాయకత్వ మార్పుపై చర్చలు
- అధిష్ఠానం సీఎంకు అభయమిచ్చిందా?

మౌనం వెనుక..



బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు నేనే ముఖ్యమంత్రిని అంటూ సిద్దరామయ్య ఢిల్లీ వేదికగా పదే పదే ప్రకటించినా అధిష్ఠానానికి చెందిన ముఖ్యులు ఎవరూ స్పందించకపోవడం, పైగా గతంలో మాదిరిగా ఎవరూ నాయకత్వ మార్పు గురించి మాట్లాడరాదని హుకుం జారీ చేసిన అగ్రనేతలు ఈ అంశమే మాకు సంబంధం లేదనేలా ఉండడంతో ముఖ్యమంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్ ఒక్కసారిగా దిగాలు పడ్డారు.

రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో పలుమార్లు నాయకత్వ మార్పు అంశంపై వ్యాఖ్యలు వచ్చాయి. సిద్దరామయ్య ఐదేళ్లు ఉంటారని మంత్రులు పదే పదే వ్యాఖ్యానించారు. ఆ వెంటనే అధిష్ఠానం అప్రమత్తమైంది. ఎవరూ నాయకత్వ మార్పు గురించి మాట్లాడరాదని హెచ్చరించింది. ఈ ఏడాది ప్రారంభంలో దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసుకునేందుకు అధిష్ఠానం అభ్యంతరం తెలిపింది. మంత్రి సతీశ్‌జార్కిహొళి కొంతమంది ఎమ్మెల్యేలతో విదేశీ పర్యటనకు వెళ్లేందుకు ఢిల్లీ నేతలు అభ్యంతరం తెలిపారు. రెండో ఏడాది పాలన ప్రారంభమైనప్పటి నుంచి పలుమార్లు అధిష్ఠానం జోక్యం చేసుకుంది. సీనియర్ ఎమ్మెల్యేలు బీఆర్ పాటిల్, రాజు కాగె వంటివారు బహిరంగంగానే ప్రభుత్వం వద్ద నిధులు లేవని వ్యాఖ్యానించడంతో అధిష్ఠానం అప్రమత్తమై రంగంలోకి దిగింది. ఏకంగా ఆరు రోజులపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రణదీప్‌సింగ్ సుర్జేవాలా ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా వన్ టూ వన్ తరహాలో చర్చలు జరిపారు. ఇలా సాగుతున్న తరుణంలోనే సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు నేను ముఖ్యమంత్రిని అంటూ బహిరంగంగా ప్రకటించారు. తొలిసారి శివకుమార్ సమక్షంలోనే బెంగళూరులో వ్యాఖ్యానించిన సిద్దరామయ్య ఢిల్లీలో ఓ చానెల్ ఇంటర్వ్యూతోపాటు పదే పదే మీడియా ముందు ఐదేళ్లు నేనే ముఖ్యమంత్రి అన్నారు. పైగా డీకే శివకుమార్‌కు ఎక్కువమంది ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడం లేదన్నారు. గతంలో ఏ అంశమైనా డీకే శివకుమార్‌కు డ్యామేజ్ అవుతుందంటే అధిష్ఠానంలో సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌లలో ఒకరు స్పందించేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ స్పందించలేదు. ఇటీవలే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వ మార్పు విషయమై ఎవరూ మాట్లాడకుండా పనిచేసుకుపోవాలని సున్నితంగా మందలించారు. ఇప్పటిదాకా బగానే ఉన్నా ఎందుకో డీకే శివకుమార్‌కు ఒక్కసారిగా ఎవరూ సహకరించలేని పరిస్థితి ఏర్పడింది. నాలుగు రోజులుగా డీసీఎం, మూడు రోజులుగా సీఎం ఢిల్లీలోనే ఉన్నా దాదాపు ఎవరికి వారు అనేలా వ్యవహరించారు. ఇక సిద్దరామయ్య నేనే ఐదేళ్లు సీఎం అనే వ్యాఖ్యల తర్వాత డీకే శివకుమార్ ఒక్కసారిగా మౌనం అయ్యారు. మూడు రోజుల పాటు ఢిల్లీలో గడిపినా, రాహుల్‌గాంధీ ఢిల్లీలోనే ఉన్నా వీరికి అపాయింట్‌మెంట్ లభించలేదు. కానీ డీకే శివకుమార్, ప్రియాంక గాంధీని ప్రత్యేకంగా కలవడం సర్వత్రా కుతూహలం అనిపిస్తోంది. డీకే శివకుమార్ బెంగళూరుకు గురువారం రాత్రికే చేరుకున్నారు. డీకే సైలెంట్ గేమ్ ఆడేందుకు సిద్ధమయ్యారా..? అనే చర్చలు ఊపందుకుంటున్నాయి. సీఎం పవర్‌గేమ్‌కు సైలెంట్ అస్త్రం ప్రయోగించారని తెలుస్తోంది. వేచి చూడాలనే ఆతృత పడరాదని కూడా భావిస్తున్నారు. మొత్తంగా అధిష్ఠానం ముందు వీలు చూసుకుని మాట్లాడాలనే ఆలోచన కూడా ఉంది. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతో చర్చలు జరపాలని అది హడావుడిగా చేసే ప్రక్రియ కాదని ఆచితూచి వ్యవహరిస్తున్నట్టుగా ఉంది. శుక్రవారం కేపీసీసీలో జరిగిన కార్యక్రమంలో డీకే మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మౌనంగా ఉండాలని సూచించారని అది బాధ్యతతో సంతోషంగా స్వీకరిస్తున్నా అన్నారు. అన్ని వ్యాఖ్యలు విన్నానన్నారు. కాగా సీఎం సిద్దరామయ్య ఒక్కసారిగా నేనే ఐదేళ్లు సీఎం అనడం వెనుక రాహుల్‌గాంధీ అభయం ఉందా..? అనేది అంతుచిక్కని రహస్యంగా ఉంది.



కాళికా దుర్గా పరమేశ్వరికి గాజుల అలంకరణ

ఆలయానికి పోటెత్తిన భక్తులు

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యారణ్యపురలో వెలసిన కాళికా దుర్గా పరమేశ్వరికి గాజుల అలంకరణ చేశారు. ఆషాఢమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. మధ్యాహ్నమయ్యేసరికి వేలాదిమంది భక్తులు తరలిరావడంతో అరకిలోమీటరుకుపైగా క్యూ కొనసాగింది. భక్తులందరికీ ప్రత్యేక దర్శనంతోపాటు ప్రసాద వినియోగం చేసినట్టు ప్రధాన అర్చకులు వసంత కుమార శాస్త్రి తెలిపారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కుటుంబం

చాముండి కొండలపై
భక్తుల సందడి

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని మైసూరు చాముండి కొండలపై భక్తుల సందడి నెలకొంది. స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సోదరుడు, ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహొళి, కుమారుడు మృణాల్ హెబ్బాళ్కర్, తల్లి, సోదరి సహా పలువురు ఉన్నారు. దర్శనానంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు తొలి కంతును తల్లి చాముండేశ్వరిదేవికి సమర్పించానన్నారు. మైసూరుకు వచ్చినప్పుడల్లా అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా ఉందన్నారు.

అదుపు తప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు

● విద్యార్థులంతా క్షేమం


ప్రమాదానికి గురైన బస్సు

కూడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపంలో శ్రీ సంగమేశ్వర ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు శుక్రవారం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయంతో వణికిపోయారు. మండల కేంద్రంలోని పాఠశాలకు పి.నాగిరెడ్డిపల్లి, ఇప్పేరు గ్రామాల నుంచి దాదాపు 50 మంది విద్యార్థులను బస్సులో ఎక్కించుకున్నారు. ఇప్పేరు దాటిన తర్వాత మలుపు వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్ కట్ కావడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. అయితే బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో విద్యుత్ లైన్లు ఉన్నాయని, జరగరానిది జరిగి ఉంటే ఎవరిది బాధ్యత అని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ రాజు పరిశీలించారు. కండిషన్ లేని బస్సులో విద్యార్థుల ను ఎలా తరలిస్తారని పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రమాదానికి గురైన బస్సును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం విద్యార్థులను మరో బస్సులో తరలించారు.

జాతీయ స్థాయిలో సర్పంచు సత్తా


హనుమంతరెడ్డి

కూడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. నారాయణపురం సర్పంచు హనుమంతరెడ్డి జాతీయ స్థాయిలో ఘనత సాధించారు. సర్పంచ్ సంవాద్ పోటీల్లో రెండో స్థానం సాధించారు. భారత నాణ్యతా మండలి దేశంలోని సర్పంచులను ఒకే వేదికపైకి తెచ్చేందుకు సర్పంచ్ సంవాద్ పేరిట మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్టింది. మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సమన్వయం, సాంకేతికత, సమాచారం మార్పిడి దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈక్రమంలోనే ప్రతి నెలా సర్పంచులకు పోటీలు నిర్వహిస్తూ, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోంది. జూన్ నెలకు సంబంధించి గ్రామాభివృద్ధి భవిష్యత్తు ఆలోచనలపై నిర్వహించిన పోటీలకు తాను పంపిన వీడియోకు జాతీయ స్థాయిలో తనకు రెండో స్థానం దక్కినట్లు సర్పంచు హనుమంతరెడ్డి తెలిపారు. నగదు ప్రోత్సహం కింద రూ. 25 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వర్సిటీలో ఉద్యోగుల గొడవ..!

అనంతపురం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో ఇద్దరు ఉద్యోగులు వ్యక్తిగత కారణాలతో గొడవ పడ్డారు. వర్సిటీలోని ఓ విభాగం వద్ద రెండురోజుల కిందట టైం స్కేల్ ఉద్యోగి నాగలింగం, డైలీ వేజ్ ఉద్యోగి పూల సాయికుమార్ మధ్య మాటామాటా పెరిగి, దాడి చేసుకున్నారు. దీనిపై నాగలింగం.. ఇటుకలపల్లి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాడు. తాను పనిమీద ఫిజిక్స్ డిపార్ట్మెంట్‌కు వెళ్లగా అక్కడే అటెండర్‌గా పనిచేస్తున్న సాయికుమార్ అసభ్య పదజాలంతో దూషిండడంతోపాటు దాడి చేశాడన్నారు. తోటి ఉద్యోగులు విడిపించారన్నాడు. పొలం తగాదాను మనసులో పెట్టుకుని, తనపై దాడి చేసినట్లు తెలిపాడు. తన సోదరి ఇటుకలపల్లికి వెళ్లేందుకు రూడ్ సెట్ వద్ద ఆటో కోసం వేచి చూస్తుండగా సాయికుమార్ బైక్‌తో ఢీకొట్టి వెళ్లిపోయాడని ఆరోపించాడు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించి, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వర్సిటీలో సదరు ఉద్యోగుల మధ్య గొడవకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని..!


వీడియోలో మహబూబ్‌బాషా

అనంతపురం క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని బుక్కరాయసముద్రానికి చెందిన మహబూబ్ బాషా అనే వ్యక్తి సెల్ఫీ వీడియో పెట్టాడు. అనంతరం విష రసాయనం తాగాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన నగర శివారులోని రాజీవ్ కాలనీలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు, మహబూబ్ బాషా కలెక్టరేట్ సమీపంలోని ఓ టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. రామాంజి అనే వ్యక్తి నుంచి వడ్డీకి అప్పు తీసుకున్నాడు. రాజీవ్ కాలనీలోని తన చెల్లెలి ఇంటికి శుక్రవారం ఉదయం వెళ్లాడు. వడ్డీ డబ్బుల కోసం తనను వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని విషాన్ని తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. వడ్డీ కట్టలేమని, అసలు కడతామని చెప్పినా రామాంజి భార్య వినలేదని మహబూబ్ బాషా భార్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు ఖాళీ చేసి అప్పగించాలని, లేదంటే ఇల్లు అమ్మి డబ్బులు కట్టాలని ఒత్తిడి తెచ్చిందని వాపోయారు. మొదట రూ.10 వడ్డీ అన్నారని, ఆ తర్వాత రూ.5 వడ్డీకి వచ్చారని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

పుట్టపర్తిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లికి చెందిన మహేంద్ర(33) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మహేంద్ర రజక వృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. వృత్తి పనులు గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చేమార్గంలేక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మహేంద్రకు భార్య నందిని, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అర్బన్ సీఐ సునీత దర్యాప్తు చేస్తున్నారు.

పందిని ఢీకొన్న ద్విచక్రవాహనం

వృద్ధురాలి మృతి

హిందూపురం, జూలై11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోతుకపల్లి వద్ద పందిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో కాంతమ్మ(70) మృతిచెందింది. పరిగి మండలం పెద్దరెడ్డిపల్లికి చెందిన కాంతమ్మ వరుసకు అల్లుడైన ఉమాశంకర్‌తో కలిసి ద్విచక్రవాహనంలో హిందూపురం నుంచి పెద్దరెడ్డిపల్లికి బయల్దేరింది. మోతుకపల్లి వద్దకు రాగానే పంది అడ్డు రావడంతో ద్విచక్రవాహనం ఢీకొని అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో కాంతమ్మ అక్కడికక్కడే మృతిచెందగా.. ఉమాశంకర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

'చేనేత పరిశ్రమను కాపాడండి'

సోమందేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమను, కార్మికులను కాపాడాలని ఏపీ చేనేత సంఘం మండల కార్యదర్శి చీల నారాయణస్వామి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతలను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఇల్లులేని చేనేత కార్మికులకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. జీఎస్టీని రద్దుచేసి చేతిమగ్గాలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. 50ఏళ్లకే పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. ఎలక్ట్రానిక్ జాకార్డులు రాయితీతో అందించాలన్నారు. ఆదరణ ద్వారా పనిముట్లు, వర్క్‌షాపులను విరివిగా మంజూరుచేయాలని కోరారు. సమావేశంలో చేనేతలు దాసరి సుధాకర్, ఉడుమల నారాయణస్వామి, దేవాంగం వెంకటేశులు, బాలంక్రిష్ణయ్య, వీరాంజనేయులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు అమ్మితే కేసులు

నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్

పెనుకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన తక్కువ మైక్రాన్‌ఉన్న కవర్లు, గ్లాసులు ఇతర ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే కేసులు నమోదుచేస్తామని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సిబ్బందితో కలిసి ఎస్‌కేడీ సర్కిల్ నుంచి తెలుగుతల్లి సర్కిల్ వరకు దుకాణాలు, హోటళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. తక్కువ మైక్రాన్‌గల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర వస్తువులు దాదాపు 6.9 కేజీల వస్తువులను సేకరించి ధ్వంసం చేశారు. పునరావృతమైతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మా పాలనలో రెండింతల అభివృద్ధి

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, వేదికపై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తదితరులు

కణేకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధిని రెండింతలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో తల్లికి వందనం పథకం కింద రూ. 10వేల కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. హంద్రీనీవా కాలువ అభివృద్ధికి రూ.3800 కోట్లు కేటాయించి రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.35 కోట్లు కేటాయించి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చెత్తపన్ను, ల్యాండ్ టైటిలింగ్‌ను రద్దు చేసి రైతులు, ప్రజలకు పన్నుల నుంచి ఉపశమనం కలిగించామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి జగన్ లాంటి భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా జగన్ పార్టీ కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. తనకు ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాలు రెండు కళ్లు అన్నారు. రాష్ట్రానికి తాను మంత్రి అయినప్పటికీ జిల్లాకు మాత్రం మొదటి కూలీగా పని చేస్తానన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తాను రాయదుర్గం నియోజక అభివృద్ధికి నిధులు అడిగిన వెంటనే మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించడం హర్షనీయమన్నారు. అనంతరం రూ. 1.70 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. హెచ్చెల్సీ మరమ్మతుల్లో భాగంగా 137 కి.మీ. వద్ద జరుగుతున్న అండర్ టన్నెల్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీదేవి, హెచ్చెల్సీ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు వన్నారెడ్డి, రమేష్‌రెడ్డి, తిప్పారెడ్డి, లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోళేకుర్తి సుదర్శన్, బసవరాజు, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, మారుతి పాల్గొన్నారు.

మామే సూత్రధారి..!

● వివాహేతర సంబంధం, భూమి విషయంలో వివాదం ● రూ.నాలుగు లక్షల సుపారీ
● ముదిగుబ్బ శివారులో హత్య ● ఐదుగురు నిందితుల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బలో జరిగిన హత్యకు సంబంధించి మృతుడి మామే సూత్రధారి అని పోలీసులు వెల్లడించారు. ఈ హత్య కేసులో నిందితులైన ఐదుగురిని అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈనెల మూడో తేదీ ముదిగుబ్బ శివారు చిన్నబుడ్డంగుట్టవద్ద గల పొలంలో ఓ వ్యక్తి మొండెం కనిపించింది. గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ శివరాముడు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు సేకరించారు. మృతుడిని తనకల్లు మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్‌గా గుర్తించారు. ప్రస్తుతం ఆయన కదిరి శివాలయం వీధిలో కాపురం ఉంటున్నట్లు తెలుసుకున్నారు. మృతుడు విశ్వనాథ్ భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తర్వాత విశ్వనాథ్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా అనుమానితులైన బత్తలపల్లి మండలం గరిశనపల్లికి చెందిన కమతం కాటమయ్య, యర్రాయపల్లికి చెందిన సాకే మధుబాబు, కమతం రామకృష్ణ, ఓడీసీ మండలం గాజుకుంటపల్లికి చెందిన బెట్టకుంట వెంకటరమణప్ప, శెట్టివారిపల్లికి చెందిన మంకముతక శంకరను గురువారం సాయంత్రం ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురంక్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి మూడు వేటకొడవళ్లు, ఒక ఆటో, మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరపరిచామన్నారు.

హత్యకు నేపథ్యం ఇదీ..

మృతుడు విశ్వనాథ్‌కు 20 ఏళ్ల కిందట ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లికి చెందిన బెట్టకుంట వెంకటరమణ పెద్దకుమార్తె శ్యామలతో వివాహం అయింది. అయితే మృతుడు తన మరదలితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, తన అత్త పేరిట ఉన్న విలువైన భూములు అమ్ముకోవడంతో మామ వెంకటరమణతో వివాదం ఏర్పడింది. దీంతో వెంకటరమణ అల్లుడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో విశ్వనాథ్‌ను హత్య చేయడానికి కమతం కాటమయ్యకు రూ.4లక్షలకు సుపారీ ఇచ్చాడు. మధ్యవర్తిగా మంకముతక శంకర వ్యవహరించాడు. కాటమయ్య కొన్ని నెలల నుంచి విశ్వనాథ్‌తో పరిచయం పెంచుకుని చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో రూ.50 వేలు అవసరం ఉంది, సర్దుబాటు చేయాలని కాటమయ్యను విశ్వనాథ్ అడిగాడు. దీంతో ముదిగుబ్బకు రమ్మని కాటమయ్య చెప్పాడు. ముందస్తు పథకం ప్రకారం కాటమయ్య, మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు కమతం రామకృష్ణ, సాకే మధుబాబులతో కలిసి మృతుడు విశ్వనాథ్‌ను ముదిగుబ్బ శివారు అటవీ ప్రాంతంలోకి మద్యం సేవించడానికి తీసుకెళ్లారు. అక్కడ విశ్వనాథ్‌ను కొడవళ్లతో నరికి హత్య చేశారు. తల మొండెం వేరు చేసి పారేసి వచ్చిన ఆటోలోనే పారిపోయినట్లు డీఎస్పీ వివరించారు.

బిందూనగర్‌లో ఎన్టీఆర్ శుద్ధజలకేంద్రం

భూమిపూజ చేసిన మంత్రి సవిత


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

పరిగి, జూలై 11(ఆంధ్రజ్యోతి): బిందూనగర్‌లో ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రానికి శుక్రవారం మంత్రి సవిత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌందీప్ ఫౌండేషన్ యాజమాన్యం సందీప్‌కుమార్ ప్రసాద్, సునీల్‌శర్మ రూ. 25 లక్షలతో తాగునీటి సమస్యను తీర్చేందుకు ముందుకు హర్షణీయమన్నారు. అనంతరం స్థానికులు డ్రైనేజీ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రానున్న నిధులతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని పంచాయతీ కార్యదర్శి అరుణకు సూచించారు. అనంతరం ధనాపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జంగాలపల్లి నుంచి ఉన్నతపాఠశాలకు రావాలంటే బస్సు సౌకర్యంలేదని, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేయాలని మంత్రిని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అక్కడి నుంచి నర్సాపురంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ రెడ్డప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హిమబిందు, మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ ఆదినారాయణరెడ్డి, జిల్లా యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సోమప్ప, కాంట్రాక్టర్ మహేశ్వర్‌రావు, వడ్డె హనుమయ్య, లక్ష్మణ్‌రావు, శాసనకోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను పరిరక్షించండి

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి భూసంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో దాదాపు 2,903 ఎకరాల వరకు దేవాలయ భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని దేవాలయాల భూములను లీజుకిచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డెంగీతో బాలింత మృతి

అనంతపురం వైద్యం, గార్లదిన్నె జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుకు చెందిన రెండు నెలల బాలింత షేక్ చాందిని(23) డెంగీతో శుక్రవారం మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కరాయ సముద్రం మండలం పి.కొత్తపల్లికి చెందిన షేక్ చాందినికి ఏడాదిన్నర క్రితం కల్లూరు వాసి షేక్ సాదిక్‌తో వివాహమైంది. వీరికి రెండుల నెలల బాబు ఉన్నాడు. ఈనెల 6న చాందినికి జ్వరం రావడంతో పామిడి ప్రభుత్వాస్పత్రిలో చూపించారు. తర్వాత అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ రక్తపరీక్షలు నిర్వహించి, డెంగీగా నిర్ధారించిన డాక్టర్లు రెండు రోజులపాటు చికిత్సలు అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం చాందిని మృతిచెందింది. ఆమె భర్త సాదిక్ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. చాందిని మృతితో రెండు నెలల పసివాడు.. తల్లిలేని వాడయ్యాడు.

కళ్లలో కారం చల్లి.. కత్తితో నరికేశాడు

తన భార్యతో చనువుగా ఉన్నాడని చంపేసిన భర్త


నవీన్ (ఫైల్)

కదిరి అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవారిపల్లిలో నవీన్ (36) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్ హత్య చేశాడు. బహిర్భూమి కోసం శుక్రవారం తెల్లవారుజామున గ్రామ శివారుకు వెళ్లిన నవీన్‌ను వెంబడించి, కళ్లలో కారం చల్లి.. కత్తితో నరికేశాడు. పోలీసులు తెలిపిన మేరకు, విశ్వనాథ్ భార్యతో నవీన్ చనువుగా ఉండేవాడు. ఆమెకు సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పెట్టేవాడు. దీంతో అనుమానం పెంచుకున్న విశ్వనాథ్.. ఈ హత్య చేశాడు. నవీన్ భార్య మూడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు సాయి, పూజిత, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. కూతుళ్లు కదిరి కేజీబీవీలో, కుమారుడు అదే గ్రామంలో చదువుతున్నారు. తల్లి లేని చిన్నారులు.. ఈ హత్యతో తండ్రిని కూడా కోల్పోయారు. తండ్రి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. హతుడి తండ్రి రాఘవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కదిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చార్జీలు తగ్గాయ్..

ఆర్టీసీ వెన్నెల, ఇంద్ర బస్సుల టిక్కెట్ రేట్ల తగ్గింపు: ఆర్ఎం

అనంతపురం టౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ వెన్నెల ఏసీ స్లీపర్, ఇంద్ర బస్సుల్లో టిక్కెట్ ధరలను తగ్గించినట్లు రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఏసీ వెన్నెల స్లీపర్ బస్సుల్లో 20శాతం, ఇంద్ర బస్సుల్లో 15 శాతం టిక్కెట్ ధరలు తగ్గించామన్నారు. కొత్త ధరలు ఈనెల 31 వరకు అమలులో ఉంటాయన్నారు.

రూట్ల వారీగా తగ్గించిన ధరల వివరాలు

రూట్	ప్రస్తుత టికెట్ ధర	తగ్గింపు టికెట్ ధర
తాడిపత్రి - హైదరాబాద్ (వెన్నెల)	1105	884
అనంతపురం - విజయవాడ (ఇంద్ర)	961	817
అనంతపురం - చెన్నై (ఇంద్ర)	832	708
అనంతపురం - తిరుపతి (ఇంద్ర)	579	493

నెల్లూరుకు భారీ విజయం

గెలుపు బాటలో అనంత జట్టు... ఉత్సాహంగా మల్టీ డే క్రికెట్ పోటీలు


కమిల్


సుబ్రహ్మణ్యం


మాధవ్‌నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని అనంత క్రీడా గ్రామంలో జరుగుతున్న సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలలో అనంత జట్టు గెలుపు బాటలో ఉంది. నెల్లూరు జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో చిత్తూరు జట్టుపై విజయం సాధించింది. నాలుగో రౌండ్ పోటీసులు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం-కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 54 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్ 109/4తో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించి.. 49.3 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంత బౌలర్లు కమిల్ 5 వికెట్లు, వినయ్‌కుమార్ 3, ప్రమోద్‌కుమార్ 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 45.5 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. గిరినాథ్ రెడ్డి 54 పరుగులు, రాజు కుళ్ళాయప్ప 49 పరుగులు సాధించారు. కర్నూలు బౌలర్లు ఆంజనేయులు 6 వికెట్లు, ఇస్మాయిల్ 2 వికెట్లు తీశారు. అనంతరం 293 పరుగల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. అనంత జట్టు మరో ఐదు వికెట్లు తీస్తే విజయం సొంతమౌతుంది.

సుబ్రహ్మణ్యం భారీ సెంచరీ..

అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 23.3 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 215/4తో రెండో రోజు ప్రారంభించిన నెల్లూరు జట్టు.. 83.1 ఓవర్లలో 413 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి రోజు రేవంత్ రెడ్డి సెంచరీ చేయగా, రెండో రోజు సుబ్రమణ్యం 216 బంతుల్లో 21 బౌండరీలు, రెండు సిక్సర్లతో 160 పరుగులు చే శాడు. చిత్తూరు బౌలర్ మాధవ్ రాయుడు 5 వికెట్లు, దీపన్ సాయినాథ్, సూర్యచరణ్ చెరో 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన చిత్తూరు, రెండో రోజు 49.2 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో నెల్లూరు జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో విజయం సొంతం చేసుకుంది. అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

అక్రమార్కులపై కొరడా

ఏడీసీసీ బ్యాంకు ఆత్మకూరు శాఖలో అవినీతిపై చర్యలు

నలుగురు అధికారుల సస్పెన్షన్... ఒకరికి షోకాజ్ నోటీసు

బోర్డు పాలకవర్గ సమావేశంలో తీర్మానం


అధికారులతో చర్చిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అక్రమార్కులపై ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి కొరడా ఝులిపించారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో బోగస్ పట్టాలతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రూ.20లక్షల రుణాలు చెల్లించిన వ్యవహారంలో నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన బోర్డు పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో 2016లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రూ.20లక్షలు బోగస్ పట్టాలపై రుణాలిచ్చారు. ఇందులో కీలకంగా వ్యవహరించిన మేనేజర్‌స్థాయి అధికారులు రాజేంద్రప్రసాద్, నరసింహమూర్తి, నాగార్జున, సూపర్‌వైజర్ అరుణకుమారిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏజీఎం స్థాయి అధికారి డీకే దుర్గాప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ... తీవ్రస్థాయిలో మందలించారు. ఈ వ్యవహారంలో మరో ఇద్దరు ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులను కూడా హెచ్చరించినట్లు సమాచారం. వంక పోరంబోకు స్థలానికి బోగస్ పట్టాలతో రూ.20 లక్షలు చెల్లించిన రుణాలు ప్రస్తుతం రూ.50లక్షల వరకు అయినట్లు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు బ్యాంకులో, సొసైటీల్లో పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని తీర్మానించారు. బ్యాంకు ప్రతిష్టను కాపాడుతూ, రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని చైర్మన్.. అధికారులకు సూచించారు. సమావేశంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి, ఆప్కాబ్ నోడల్ అధికారి సురేంద్ర, రెండు జిల్లాల సహకార శాఖాధికారులు అరుణకుమార్, కృష్ణానాయక్, నాబార్డు డీడీఎం అనురాధ పాల్గొన్నారు.

15 నుంచి గ్రామ సభలు

అనంతపురం న్యూటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 15 నుంచి 25వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని జడ్పీ సీఈఓ శివశంకర్.. ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామసభల్లో ఇప్పటికే గుర్తించిన బంగారు కుటుంబాలకు సంబంధించిన జాబితాను పరిశీలించాలన్నారు. వ్యత్యాసాలు ఉంటే సరిదిద్దాలని ఆదేశించారు.

సాంకేతికతపై అవగాహన కల్పించండి

తహసీల్దార్ మారుతి

గోరంట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): సాంకేతికతపై ప్రజలకు కార్యదర్శులు, డిజిటల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని తహసీల్దార్ మారుతి సూచించారు. ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 21 రోజుల్లో జనన, మరణాలను నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు అవుతున్నాయన్నారు. ప్రజలకు విషయాలు తెలిసేలా ప్రతి సచివాయలంలో నోటీసు బోర్డులు ఉంచాలని ఎంపీడీఓ నరేంద్రకుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. వచ్చిన ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. సూర్యఘర్ పథకంపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు వివరించారు. బిల్లులు సకాలంలో అందడంలేదని పలువురు సర్పంచ్‌లు సమావేశానికి గైర్హాజరయ్యారు. ప్రభుత్వ అధికారుల ప్రసంగాలు మినహా ఎలాంటి చర్చ జరగకుండా మండల సర్వసభ్య సమావేశం ముగిసింది.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కారం చేసుకోవచ్చని సీనియర్ సివిల్‌న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణంలో న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అత్యున్నత న్యాయస్థానం కేసుల సత్వర పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం-రాజీపథక సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిద్వారా సమయం వృథాకాకుండా ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసులు పరిష్కారం అవుతాయన్నారు. వాణిజ్య, వ్యక్తిగత సంబంధాలు ఏమాత్రం చెడిపోకుండా ఉంటాయన్నారు. మధ్యవర్తిత్వం కక్షిదారుల సమస్య పరిష్కారంలో ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే కొన్ని నగరాల్లో మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా ఎన్నో కేసులు పరిష్కారం అవుతున్నాయన్నారు. దీనిపై న్యాయవాదులు కక్షిదారులకు తెలియజేసి కేసులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దు, రాజశేఖర్, కళావతి, సంతోష్‌కుమారి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

పువ్వాడ శేషగిరిరావు (జయంతి)



'కవి పాదుషా'గా పేరొందిన పువ్వాడ శేషగిరిరావు 1906 జూలై 12న కృష్ణా జిల్లా మొవ్వలో జన్మించారు. ఉభయభాషా ప్రవీణులు. పండితులుగా, ఉపన్యాసకులుగా వ్యవహరించారు. పద్యాలు, గద్యాలు, నాటకాలు రచించారు. నవ్య కవులలో ఒకరిగా పేరొందారు. 'ఢిల్లీ దర్బారు నాటకం' విజయవాడ నుంచి ఆలిండియా రేడియోలో ప్రసారమవ్వగా, రక్తతర్పణం వంటి బుర్రకథలు ఎంతో పేరొందాయి. 1981 మే 24న కన్నుమూశారు.

జూలియస్ సీజర్ (జయంతి)



గయస్ జూలియస్ సీజర్ క్రీస్తుపూర్వం 100 జూలై 12న జన్మించారు. రోమన్ మిలిటరీ, రాజకీయ నాయకుడు. రోమన్ రిపబ్లిక్‌ను రోమన్ సామ్రాజ్యంగా మలచడంలో కీలకపాత్ర పోషించారు. పాలనలో సంస్కరణలు తెచ్చి తనదైన ముద్రను వేశారు. జూలియన్ క్యాలెండర్‌ను రూపొందించారు. ప్రత్యర్థుల చేతిలో 44 మార్చి 15న హతమయ్యారు.

ఆచంట శరత్‌కమల్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ఆచంట శరత్ కమల్ 1982 జూలై 12న చెన్నైలో జన్మించారు. తమిళనాట స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందినవారు. టేబుల్ టెన్నిస్‌లో బెస్ట్ ప్లేయర్‌గా డజనుసార్లు ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించారు. సీనియర్ నేషనల్ ఛాంపియన్‌ను 9సార్లు అందుకున్న తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. 2004 ఒలింపిక్ గేమ్స్‌లోనూ, 2006 ఏసియన్ గేమ్స్‌లోనూ భారత్ తరపున ప్రాతినిథ్యం వహించారు. మెన్స్ సింగిల్స్‌లో బంగారు పతకాన్ని కైవశం చేసుకోవడం ద్వారా 'అర్జున అవార్డు' పురస్కారం సాధించారు. 2018 కామన్వెల్త్‌లో బంగారం, రజతం, కాంస్య పతకాలు సాధించారు. 2022లో మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు అందుకున్నారు. 2024 ప్యారిస్ ఒలింపిక్ గేమ్స్‌లో ఇండియన్‌ఫ్లాగ్ బేరర్స్‌లో ఒకరిగా ఉన్నారు. ఇటీవల ఆయన రిటైర్మెంట్ ప్రకటించారు.

మలాలా యూసఫ్ జాయ్ (పుట్టినరోజు)



చిన్నవయసులో 'నోబెల్ పురస్కారం' అందుకున్న పాకిస్థాన్‌కు చెందిన సాహస బాలిక మలాలా యూసుఫ్ జాయ్ 1997 జూలై 12న జన్మించారు. మానవ హక్కులు ప్రత్యేకించి మహిళలు, చిన్నారుల విద్యకోసం ఎంతో కృషి చేశారు. ఉగ్రవాదుల అరాచకాలపై గళమెత్తారు. 'మలాలా ఫండ్' పేరిట స్వచ్ఛందసంస్థను ఏర్పాటు చేశారు. తన జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలను 'ఐ యామ్ మలాలా' పేరిట పుస్తకం రాయగా సంచలనం సృష్టించింది. పాకిస్థాన్ తొలి నేషనల్ యూత్ పీస్ ప్రైజ్, సఖరోవ్ ప్రైజ్ అవార్డులు అందుకున్నారు. 2023లో ఆక్స్‌ఫర్డ్ లైనాకర్ కాలేజ్ నుంచి గౌరవ ఫెలో అందుకున్నారు.

స్వల్ప కాలంలోనే

మరిన్ని కొత్త రైళ్లు

● కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న



మాట్లాడుతున్న మంత్రి సోమన్న

బళ్లారి, జూలై11(ఆంధ్రజ్యోతి): దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వేలో విప్లవాత్మక మార్పులొచ్చాయనీ, తాను పదవీబాధ్యతలు స్వీకరించిన స్వల్పకాలంలోనే రాష్ట్రంతో సహా అనేక ప్రదేశాలలో మరిన్ని రైళ్లు మంజూరయ్యాయని కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న అన్నారు. బళ్లారి రైల్వే స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పది వందేభారత్ రైళ్లు నడుపుతోందన్నారు. మరిన్ని రైళ్లు నడుస్తున్నాయని, స్లీపర్ వందే భారత్ రైలు త్వరలో ప్రారంభిస్తామన్నారు. యూపీఏ హయాంలో నిలిచిపోయిన అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యాయన్నారు. 3,300 అండర్‌పాస్‌లు, ఓవర్ పాస్‌లు మాత్రమే నిర్మించారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 6,600కిపైగా వంతెనలను నిర్మించినట్లు తెలిపారు. దీని కారణంగా చాలా రైల్వే సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. గురువారం చిక్కమగళూరు-తిరుపతి కొత్త రైలును ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 14 కొత్త రైళ్లు నడుస్తున్నాయన్నారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తరువాత కర్ణాటక కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కారణంగా అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. లెవెల్ క్రాసింగ్ రైల్వే శాఖకు పెద్ద తలనొప్పిగా మారిందన్నారు. ప్రస్తుతం దానిని దశల వారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. చిక్కజాజూరు బళ్లారి రైల్వే డబ్లింగ్ పనులు చాలా రోజులుగా నిలిచిపోయాయన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.3300 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని అన్నారు. అమృత్ స్టేషన్ ప్రాజెక్టు కింద అనేక చోట్ల రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ చేపడుతున్నామని తెలిపారు. దేశ ప్రతిరూపాన్ని మార్చడానికి మోదీ కర్ణాటకకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. పునరుజ్జీవనం బళ్లారి జిల్లా చుట్టూ 40 కిలోమీటర్లు ఎక్కడా రైల్వే క్రాసింగ్‌లు లేకుండా అన్ని చోట్లా ఎల్‌వోబీలు, ఆర్‌ఓబీలు నిర్మించాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. త్వరలోనే ఈ విషయంలో ఒక ఉత్తర్వు జారీచేసి సర్వే నిర్వహించాలని ఆదేశిస్తానన్నారు. నేను వచ్చినప్పటి నుంచి బళ్లారిలో అన్ని పనులకు ప్రాధాన్యం ఇచ్చానన్నారు. రైల్వే ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నాయని తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మాదకద్రవ్యాలతో పతనం

» సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్



జ్యోతిని వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ తదితరులు

దొడ్డబళ్ళాపుర, జూలై 11(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు తీసుకోవడం ద్వారా పతనం తప్పదని దొడ్డబళ్ళాపుర మహిళా పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్ అభిప్రాయ పడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో విజయకర్ణాటక రక్షణా వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ పీయూ కళాశాలలో ఏర్పాటైన యువ జాగృతి కార్య క్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి యువత దుర్వ్యసనాలకు లోను కారాదనే ఉద్దేశ్యంతోనే చైతన్య కార్యక్రమం చేపట్టామన్నారు. బీడీ, సిగరెట్, మద్యపానం, పేకాట, మాదకద్రవ్యాల వ్యసనం వంటివి ఆరోగ్యానికి, ఆర్థికంగాను దెబ్బ తీయడమే కాక సమాజంలో పరువును కోల్పోయేలా చేస్తాయన్నారు. 24 గంటల సమయంలో 8 గంటలు నిద్ర, భోజనం, వ్యక్తిగత పనులతోపాటు చదువుకు కనీసం 5 గంటలు కేటాయించాలన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. రూరల్ సీఐ సాదిక్‌పాషా మాట్లాడుతూ సోషల్‌మీడియా వల్ల సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్ రమ్మీయాప్ వంటి వాటి ద్వారా నష్టపోతున్నారని కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇటీవలికాలంలో డిజిటల్ అరెస్టు పేరిట వంచనలకు పాల్పడు తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. టౌన్ ఎస్ఐ అమరేశ్‌గౌడ, విజయకర్ణాటక రక్షణావేదిక సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, సతీశ్, తాలూకా కార్యనిరత పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆర్‌టీఐ కార్యకర్తల సంఘం రాష్ట్ర సంచాలకులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోడౌన్లలో ఎమ్మెల్యే తనిఖీలు



స్టేషనరీ విభాగంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంజునాథ్

ముళబాగిలు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (టీఏపీసీఎంఎస్)లో అన్నిరకాల నాణ్యమైన ఎరువులు తక్కువధరలతో రైతులకు సంఘం ద్వారా లభిస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోలారు ఎమ్మెల్యే, టీఏపీసీఎంఎస్ అధ్యక్షుడు కొత్తూరు జీ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని టీఏపీసీఎంఎస్‌లలో గోడౌన్లలో ఉన్న ఎరువులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను సంఘంలో 2021లో అధికార చేపట్టాక పాలక వర్గ సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నట్టు తెలిపారు. గత పదేళ్లుగా నగరసభకు బకాయి ఉన్న రూ.40 లక్షల పన్నును సంఘం లాభాలలో చెల్లించినట్టు తెలిపారు. 76ఏళ్ల చరిత్ర కల్గిన సంఘంలో 3,819మంది షేర్‌హోల్డర్‌లు ఉన్నారన్నారు. 2024-25లో సంఘం రూ.16.44కోట్ల లావాదేవీలతో లాభాల బాటలో ఉందన్నారు. సంఘంలో స్టేషనరీ విభాగం, డ్రిప్స్ ఉపకరణాలు, ఇ-స్టాంప్స్ సౌలభ్యాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సంఘం భవనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి బీఆర్ శివశంకర్, సహాయక కార్యదర్శి నారాయణస్వామి, నారాయణ స్వామి, జమ్మనహళ్ళి కృష్ణ, వీకే రాజు పాల్గొన్నారు.

ఈడీ సోదాల్లో అక్రమ ఆస్తులు లభించలేదు

» ఎమ్మెల్యే సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలలో ఎలాంటి అక్రమాస్తులు లభించలేదని బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి వెల్లడించారు. పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు చెందిన బెంగళూరు నివాసంలో గురువారం ఈడీ దాడులు నిర్వహించిందన్నారు. ఫెమా నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణల నేపథ్యంలో దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. హాంకాంగ్, జర్మనీ, మలేషియా దేశాలలో బ్యాంకు వ్యవహారాలు జరిగాయని, కొన్ని సంస్థలలో పెట్టుబడులు పెట్టాయనే విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యే మాట్లా డుతూ తన, తన బావమరిది నివాసం సహా నాలుగుచోట్ల దాడులు కొన సాగాయన్నారు. విదేశాలలో ఎలాంటి వ్యవహారాలు లేవని, నియమాలు ఉల్లంఘించలేదన్నారు. అక్రమార్జన ఆరోపణలకు ఎలాంటి రికార్డులు లేవని స్పష్టం చేశారు. కాగా సోదాల వేళ కొన్ని సందేహాల నివృత్తికోసం తనను తీసుకెళ్లారని, ఈనెల 14న రావాలని ఈడీ కార్యాలయానికి రావాలని సూచించారన్నారు. తాను నిజాయితీగా ఉన్నప్పుడు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

సామాజిక సేవతో గుర్తింపు



క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో నవీన్‌కిరణ్ తదితరులు

చిక్కబళ్లాపుర, జూలై11(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలలో నిర్వహించే సామాజిక సేవలు, రక్తదాన శిబిరం ద్వారా గుర్తింపు సాధ్యమైందని పంచగిరి విద్యా ట్రస్టు చైర్మన్ కేవీ నవీన్‌కిరణ్ అభిప్రాయపడ్డారు. నగరంలోని సీవీవీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటైన క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలలో తరచూ పాల్గొనడం ద్వారా దేహధారుడ్యం సాధ్యమని, అలాగే రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడినట్లు అవుతారన్నారు. పంచగిరి విద్యా ఎండోమెంట్ డే, సీవీ వెంకటరాయప్ప జయంతిని అర్థవంతంగా ఆచరించడం సంతోషంగా ఉందన్నారు. సీవీ వెంకటరాయప్ప కన్నుమూసి 36 ఏళ్లు గడిచినా ఆయన ఆదర్శాలు నేటికీ అనుసరణీయమన్నారు. కాగా క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తియే ప్రధానమన్నారు. విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రోత్సహించేలా కార్యక్రమం రూపొందించినట్టు తెలిపారు. విద్యార్థుల క్రీడా ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా ట్రస్టు సీనియర్ సభ్యులు బీ మునియప్ప, నిర్మలసాయి ప్రభు, పాలనాధికారి డాక్టర్ సాయిప్రభు, ఆరీఫ్ సయ్యద్, ఇమ్రాన్‌ఖాన్, మేనేజర్ లక్ష్మణస్వామి, డాక్టర్ రాజ్‌కుమార్ అభిమానులసంఘం అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రధనుస్సు



విజయపుర, జూలై 11(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఈ సందర్భంగా ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనుస్సును వీక్షించేందుకు పీయూ కళాశాల మైదానం ప్రాంతానికి స్థానికులు పెద్దసంఖ్యలో చేరారు. సుమార గంటపాటు ఇంద్రధనస్సు ముగ్ధమనోహరంగా ఉండి ఆకట్టుకుంది. దీంతో ప్రజలు ఫోటోలు తీసుకునేందుకు ఆసక్తిచూపారు. ప్రకృతి రమణీయ దృశ్యాన్ని వీక్షించేందుకు పలువురు ఉత్సాహం చూపారు. వర్షం కురవడంతో చుట్టుపక్కల ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

మద్యం నియంత్రణకు శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

దొమ్మసంద్ర, జూలై 11(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ సంస్థ ఆధ్వర్యంలో బిదరగుప్పె గ్రామంలోని కల్యాణమండపంలో మద్యం నియంత్రణ శిబిరం నిర్వహించారు. సంస్థ సామాజిక సేవలలో భాగంగా గ్రామాలలో ఆలయాల జీర్ణోద్ధరణ, చెరువుల పునరుద్ధరణతోపాటు మహిళలకు టైలరింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ ఆంజినప్ప మాట్లాడారు. ధర్మస్థళ సంస్థ ఒక ప్రాంతానికే పరిమితం కాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని కొనియాడారు. ఇటీవలికాలంలో తలెత్తిన మద్యం వ్యసనం నుంచి బయటపడేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. తరచుగా ఇటువంటి శిబిరాల ద్వారా ప్రజలకు మరింత ప్రయోజన కార్యక్రమాలు కొనసాగించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ బెంగళూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ భార్గవ్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు అనుపమ నారాయణ, ఆరోగ్య అధికారి డాక్టర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పండుగల కోసం ప్రత్యేక సామగ్రి



అలంకరణ సామగ్రిని కొంటున్న యువతులు

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఇక పండుగల సీజన్ రానుందని అలంకరణ సామగ్రిని ఒకేచోట అందుబాటులోకి తెచ్చామని ప్రముఖ నటి సింధు లోకనాథ్, స్పిరిటెడ్ క్రియేటర్ దీక్షా బన్సాల్ అభిప్రాయపడ్డారు. చిత్రకళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను శుక్రవారం వారు ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, చేతివృత్తులతో సిద్ధం చేసిన కళాఖండాలను ప్రదర్శించారు.

అయ్యో.. పాపం..!

● బీటీపీలో మునిగి బావ, బామ్మర్ది మృతి
● సరదాగా చేపల వేటకెళ్లగా ప్రమాదం
● కుటుంబంలో విషాదం





మన్సూర్, జబీవుల్లా (ఫైల్)

గుమ్మఘట్ట, జూలై11(ఆంధ్రజ్యోతి): చేపల వేట సరదా బావబామ్మర్దిని బలిగొంది. మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)లో మునిగి జబీవుల్లా(30), మన్సూర్ (38) శుక్రవారం మరణించారు. గుమ్మఘట్ట ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని మొలకల్మూరు తాలూకా రాంపురం గ్రామానికి చెందిన జబీవుల్లా కార్పెంటర్. అతడికి రాయదుర్గం పట్టణానికి చెందిన గుల్జార్‌బానుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. నెల రోజుల క్రితమే గుల్జార్‌బాను మగబిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబంలో సంతోషం నెలకొంది. గుల్జార్‌బాను పుట్టింట్లోనే ఉంది. ఈ నేపథ్యంలో జబీవుల్లా వారం రోజుల క్రితం మొహర్రం పండుగకు రాయదుర్గానికి వచ్చాడు. రాయదుర్గానికే చెందిన బామ్మర్ది మన్సూర్‌తో కలిసి బైక్‌పై శుక్రవారం సరదాగా బీటీపీలోకి చేపల వేటకు వెళ్లాడు. డ్యాం డిస్ట్రిబ్యూటరీ వద్ద గేలం వేస్తుండగా.. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో పడిపోయారు. ఈత రాకపోవడంతో ఊపిరాడక మరణించారు. కాసేపటికి అటుగా వెళ్లిన మత్స్యకారులు.. గట్టుపై బైక్, చెప్పులు ఉండడాన్ని గుర్తించారు. మనుషులెవరూ కనిపించలేదు. అనుమానం వచ్చి వల విసిరారు. ఒకరి మృతదేహం లభించింది. వెంటనే వారు.. పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో కలిసి ఎస్ఐ ఈశ్వరయ్య ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మరోసారి వల వేయగా.. మరో మృతదేహం బయటపడింది. వారి జేబుల్లోని ఆధార్ కార్డులోని వివరాల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాలను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మన్సూర్ బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. అతడికి భార్య తబ్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్ద బోరున విలపించారు.

సేవ చేసేందుకే పార్టీలో చేరండి

» డీకే శివకుమార్ పిలుపు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీకే శివకుమార్

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉందని కాంగ్రెస్‌లో చేరడం కాదని, పార్టీ సేవకోసమే అంకితభావంతో ఉండాలని కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. కేపీసీసీలో శుక్రవారం మాజీ మంత్రి బీటీ లలితానాయక్‌తోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ బీటీ లలితానాయక్ కవయిత్రిగానే కాకుండా ఆమె జీవితమే ఒక పోరాటమని కొనియాడారు. పార్టీలో పదవులు ఆశించరాదని పనిచేస్తుంటే అవే వస్తాయన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



మీడియా సమావేశంలో న్యాయాధికారులు

శిడ్లఘట్ట, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవల ప్రాధికార ఆధ్వర్యంలో 12న శనివారం లోక్ అదాలత్ జరగనుందని జిల్లా న్యాయసేవా సమితి మెంబర్ సెక్రటరీ శిల్పా తెలిపారు. పట్టణంలోని కోర్టు సభాంగణంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే జరిగిన పలు లోక్‌అదాలత్‌లలో శిడ్లఘట్ట కోర్టులో ఉత్తమ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయన్నారు. చిక్కబళ్ళాపుర జిల్లాలో చింతామణి, గౌరిబిదనూరు తర్వాతి స్థానంలో ఉన్నాయన్నారు. అదాలత్‌లో సివిల్, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకుల రుణాలు, కుటుంబ కలహాలు తదితర కేసులు రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మహ్మద్ రోషన్‌షా, సుకన్యా సీఎస్, తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, కార్యదర్శి సీబీ భాస్కర్ పాల్గొన్నారు.

కార్మికుల కిట్‌లలో అక్రమాలు



కిట్లను పరిశీలిస్తున్న సూలికుంటె రమేశ్

బంగారపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కట్టడకార్మికులకు ఇస్తున్న కిట్‌ల పంపిణీలో కోట్లాదిరూపాయలు అక్రమాలు జరిగాయని దళిత సంఘర్ష సమితి రాష్ట్ర సంఘం సంచాలకులు సూలికుంటె రమేశ్ డిమాండ్ చేశారు. కార్మికుల కిట్‌లకు సంబంధించి నాసిరకం పరికరాలు అందచేసిన కంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం కిట్‌ల నాణ్యను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు రూపొందించిందన్నారు. కార్మికులకు ఉచితంగా సమకూరుస్తున్న కిట్లలో నాణ్యత పాటించలేదన్నారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గురుపూర్ణిమ ప్రసాదం పంపిణీ



ఆలయంలో సన్‌రైజ్ పబ్లిక్‌స్కూల్ నిర్వాహకులు

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని పీణ్యా రెండోస్టేజ్ రాజగోపాల్‌నగర్‌లోని షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. హాజరైన భక్తులకు సన్‌రైజ్ పబ్లిక్‌స్కూల్ నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు. ఉదయం 7 గంటలనుంచి రాత్రి దాకా వేలాది మంది భక్తులు పాల్గొన్నారని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. పబ్లిక్‌స్కూల్ సంస్థ ఆధ్వర్యంలో సుంకదకట్టె పైప్‌లైన్ రోడ్డులో మరో దేవాలయం నిర్మిస్తున్నట్టు తెలిపారు. మరో నెలరోజుల్లో సంపూర్ణంగా పనులు పూర్తి కానున్నాయని, విగ్రహ ప్రతిష్ఠాపన సెప్టెంబరులో ఉంటుందని ప్రకటించారు.

వర్షాకాల వ్యాధులపై అప్రమత్తం

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో తలెత్తే సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సింటెక్స్ ప్యూర్‌ప్లస్ సంస్థ పేర్కొంది. ఈ సీజన్‌లో అతిసార వంటివి ప్రబలుతాయని చుట్టుపక్కల ప్రాంతాలలో స్వచ్ఛత పాటించాలన్నారు. అతిసార కారణంగా శిశుమరణాల ప్రమాణం దేశంలో అధికంగా ఉందని ప్రకటనలో పేర్కొంది. ఐదేళ్లలోపు చిన్నారులు దేశవ్యాప్తంగా సుమారు 13శాతం ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నీటి తొట్టెలను, డ్రమ్స్‌ను, సంప్‌లను తరచూ శుభ్రం చేసుకోవాలని, దోమలు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. అవసరమైన మేరకు వైద్య సలహా సూచనలు పాటించాలని పేర్కొన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.86	1604.12
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	41,972	25,349
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	40,657	205
నీటి నిల్వ (టీఎంసీలు)	76.03	27.33

నేడు జాతీయ లోక్ అదాలత్


న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): నేషనల్ లీగల్, స్టేట్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ శనివారం నగరంలోని తాలూర్ రోడ్డు కొత్త కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె తెలిపారు. బళ్లారి, విజయనగరం జిల్లాలోని 31 కోర్టుల ద్వారా లోక్ అదాలత్‌లో ప్రజలు తమ ప్రీలిటిగెంట్, క్రిమినల్, చెక్ బౌన్స్, బ్యాంక్, మోటారు వాహన ప్రమాద పరిహార ట్రిబ్యునల్, వైవాహిక, కటుంబ, సివిల్ కేసులు పరిష్కరించుకుని ఉపశమనం పొందడానికి ఇది ఒక సువర్ణావకాశమన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పీడబ్ల్యూడీ ఏఈఈగా బసవరెడ్డి



బళ్లారి గాంధీనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజా పనుల శాఖ బళ్లారి డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి. బసవరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఈఈగా పనిచేసిన సుదర్శన్ రెడ్డి పదవీ విరమణ తరువాత ఇన్‌చార్జిగా గవియప్ప కొన్నిరోజులు పనిచేశారు. ప్రభుత్వం రెగ్యులర్ ఏఈఈని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 4న బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. గతంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ప్రజా పనుల శాఖ పలు విభాగాల్లో పని చేసిన అనుభవం ఉంది. ఆయన మాట్లాడుతూ బళ్లారి డివిజన్‌లో వచ్చే సిటీ, రూరల్ నియోజకవర్గంతో పాటు కురుగోడు, కంప్లి పరిధిలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు అధికారులు, తోటి ఇంజనీర్ల సహకారం అవసరమన్నారు.

బీమా ఉద్యోగుల సమ్మె


నిరసన తెలుపుతున్న బీమా ఉద్యోగులు

బళ్లారి సిటీ,జూలై 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఇన్సురెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం ఎల్ఐసీ కార్యలయం ముందు ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. బ్రాంచ్ యూనిట్ అధ్యక్షుడు కమల్‌హాసన్ మాట్లాడుతూ కొత్తగా జారీ చేసిన పెన్షన్ పద్ధతిని రద్దుచేయాలన్నారు. పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, బీమా ప్రీమియంలపై జీఎస్టీ కొత్త పెన్షన్ బీమా రంగంలో వీదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, కార్మికుల అవుట్‌సోర్సింగ్‌పే తీసివేయాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి కామ్రేడ్ అనిల్‌కుమార్, కామ్రేడ్ కీర్తి, కోశాధికారి రమేశ్, శైలజ, సంతోష్ బ్రాంచ్ లోని సిబ్బంది హాజరయ్యారు. ఇతర కార్మిక సంఘాల నేతృత్వంలో జరిగిన సమ్మెకు మద్దతు ప్రకటించారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన

హొస్పేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన 2025 వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నగరంలోని ముస్లింలు మసీదుల ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. మసీదుల ఎదుట మానవహారంగా ఏర్పడ్డారు. అంజుమన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని రాజ్యాంగంలోని ఆకల్14, 25, 26, 29లలో పొందుపరిచిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోరాటం ప్రారంభిస్తామని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంజుమన్ కమిటీ సభ్యుడు గులాం రసూల్, నగర కౌన్సిల్ సభ్యుడు అస్లాం మలగి, నాసిర్, ఇంతియాజ్, అజామ్, చాంద్‌బాషా, కే నజీర్, లియాఖత్, ఖావాజా హసేన్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ముస్లింలు

చిన్నకుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలి: డీహెచ్ఓ


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు, డాక్టర్ మరియంబి

బళ్లారి సిటీ, జూలై 11(ఆంధ్ర జ్యోతి): చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు కోరారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఆసుపత్రి, తాలూకా ఆరోగ్య అధికారి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని భాగంగా శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ప్రజా అవగాహన ర్యాలీని డీహెచ్ఓ ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతున్న జనాభా దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో అనేక సమస్యలను తెస్తోందన్నారు. జంటలు చిన్నకుటుంబాన్ని కలిగి ఉండటానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 10,528 మంది మహిళలకు ల్యాప్రోస్కోపిక్ ట్యూబెక్టమీ సర్జరీలు నిర్వహించామన్నారు. దీని గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన గర్భనిరోధక ఇంజెక్షన్, ఇంటర్ ఇంజెక్షన్ 4,389 మందికి ఇచ్చామన్నారు. ఇది ప్రతి 3నెలలకు ఒకసారి ఇవ్వగల ఇంజెక్షన్ అన్నారు. ఇప్పటివరకు 3,650 మంది మహిళలకు వాంకిని అమర్చినట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కుటుంబ సంక్షేమ అదికారి డాక్టర్ హనుమంతప్ప మాట్లాడుతూ మాతృత్వ వయస్సు, శరీరం, మనస్సు తయారీ అనేది ఈ సంవత్సరం నినాదం, వివాహం తర్వాత కనీసం మూడు సంవత్సరాలు పిల్లలను నిరోధించడం ఇద్దరు పిల్లలకు జననాలను నియంత్రించడం ఒక బిడ్డ తర్వాత కనీసం మూడు సంవత్సరాల అంతరం ఉండాలని సూచించారు. జిల్లా ఆసుపత్రి ఆవరణం, సంఘం సర్కిల్, జిల్లాఆసుపత్రి ఆవరణలో ర్యాలీ ముగిసింది. ఊరేగింపులో అవగాహన పోస్టర్ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి, క్షయ నిర్మూలన అధికారి ఇంద్రాణి, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్‌దాసప్పనవర్, డాక్టర్ సురేశ్, డాక్టర్ ప్రియాంక, మహాదేవి, హుగరాజ్, శాంతమ్మ, గంగమ్మ, ఉషారాణి, ప్రహ్లాద్‌రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు కళల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

● మేయర్ ముల్లంగి నందీశ్



మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీశ్

బళ్లారి సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు కళలపై ఆసక్తి పెంచుకోవాలని మహానగరపాలకె మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కన్నడ సంస్కృతిక విభాగం అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన యువ సౌరభ కార్యక్రమాన్ని డ్రమ్ వాయిస్తూ మేయర్ ప్రారంభించి మాట్లాడారు. కళలను అస్వాదించాలనే మనస్తత్వం చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకూడదని, వారు తమ కళా ప్రతిభను వెలికితీసి సాంస్కృతికంగా దేశానికి దోహదపడాలని అన్నారు. హామీల పథకం అమలు అథారిటీ చైర్మన్ కే.ఈ.చిదానందప్ప మాట్లాడుతూ విద్య అంటే కేవలం విద్యాభ్యాసం మాత్రమే కాదని వారుతమ కళాప్రతిభను వెలికి తీసి ఎదగాలన్నారు. యువత మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, కళలను ప్రోత్సహించడానికి యువ సౌరభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ పథకాలలో ఒకటైన యువనిధి గురించి అవగాహన కార్యక్రమం గురించి చాన్స్‌లర్‌తో చర్చలు జరిగాయని ఆయన అన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.మునిరాజు మాట్లాడుతూ నేటి ఒత్తిడితో కూడిన జీవితంలో కళలు ప్రశాంతతను అందించగలవన్నారు. బళ్లారిలోని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో కళా అధ్యయనాల కోసం నాటక విభాగం ఉందని, విద్యార్థులకు కళా విద్యను బోధించే పనిలో ఉందన్నారు. విశ్వవిద్యాలయంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఆడిటోరియం నిర్మాణంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రితో చర్చిస్తామన్నారు. అనంతరం కంప్లి, ఎమ్మిగనూరుకు చెందిన జ్ఞానేశ్వర్ బృందంచే సంగీతం, బళ్లారికి చెందిన నటరాజ కూచుపూడి నృత్యం, సంగీతం అండ్ చారిటబుల్ ట్రస్ట్ బృందంచే బృంద నృత్యం, సండూర్ తాలూకాలోని నాగలాపూరానికి చెందిన శరణబసవ జానపద గీతం, బయలాట, డొల్లుకుణిత తదితర వాటిలో పాల్గొన్న అన్నిజట్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.సాలి, కర్ణాటక బంజారా సంస్కృతి అకాడమీ సభ్యుడు ప్రొఫెసర్ శాంతనాయక, కన్నడ సాంస్కృతిక అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజుతో పాటు విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


దేవి నృత్య రూపకం

పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించండి

కంప్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా పరిధిలోని కోళూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐడీఎస్ఓ నాయకులు డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు కే ఈరన్న మాట్లాడుతూ కోళూరు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 5 నుంచి 8వ తరగతి వరకు 200 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు వచ్చే పిల్లలందరూ పేదలు, రైతుల పిల్లలు కానీ ఈ పాఠశాలకు ప్రభుత్వ భూమిలో సొంత భవనం లేదన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు టాయిలెట్ ఉపయోగించడానికి ఇంటి నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక విద్యార్థుల పరిస్థితి ఎలా వుంటుందో ఆలోచించాలని అన్నారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు లేకపోవడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం పక్కనే ప్రభుత్వ భూమిలో భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో వెంటనే స్పందించి నూతన పాఠశాల నిర్మించాలని అప్పటివరకు ప్రైవేటు భూమిలో ఉన్న పాఠశాలకు తాగునీరు, మరుగుదొడ్లు అందించాలన్నారు. అనంతరం సీఆర్పీకి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన సీఆర్పీ మూడు నెలల్లో సొంత భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు మాట్లాడుతూ 15 రోజుల్లో తాగునీరు, మరుగుదొడ్లను మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఏఐడీఎస్ఓ ఉపాధ్యక్షురాలు శాంతి, జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్, గ్రామ నాయకులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

సర్వీస్ సెంటర్‌లో ఈ-స్టాంప్ సౌకర్యం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

బళ్లారి సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాల్మీకి సర్కిల్ సమీపంలో తాలూకా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రాంగణంలో జనరల్ సర్వీస్ సెంటర్‌లో ఈ స్టాంప్ సౌకర్యం కల్పించినట్లు సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే రైతులకు రుణాలు, రసాయన ఎరువులు మొదలైనవి అందిస్తున్న ఈ సంఘం రాయితీ ప్రాతిపదికన సూపర్ మార్కెట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ-స్టాంప్ జిరాక్స్‌ను, డీటీపీ, ఆధార్‌కార్డు దిద్దుబాటు, రిజిస్ట్రేషన్, రైల్వే టిక్కెట్లు, పాన్‌కార్డ్, పాస్ ఫొటో, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ జ్ఞానప్ప, ఉపాధ్యక్షులు శిల్ప, డైరెక్టర్లు కెరెకోడప్ప, దొడ్డనగౌడ, పంపాపతి, ఫక్కీరప్ప, ఆంజనేయ, కల్పన, చంద్రిక, శ్రీకళ, శారదమ్మ, నామినేటెడ్ డైరెక్టర్ చంద్రశేఖర్, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

కంప్లి, జూలై11(ఆంధ్రజ్యోతి): తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కూడ్లిగి డీఎస్పీ మల్లేష్ దొడ్డమనె ఆదేశాల మేరకు కొట్టూరు, తంబార్లపల్లి, హగరి బొమ్మనల్లి పట్టణాల పరిధిలో రెండు రోజులుగా స్కూలు బస్సులు వ్యాన్ల డ్రైవర్లకు పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల వాహనాలకు డ్రైవర్లు క్రమశిక్షణ, యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సురెన్స్ తప్పనిసరిగా వుండాలన్నారు. ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు నియమాలు పాటించని డ్రైవర్లపై కేసులు పెట్టి వారి లైసెన్స్ రద్దు, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.


డ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న పోలీసు


వామదేవశివాచార్యుల స్వామికి తులాభారం

సంప్రదాయాలపై అవగాహన అవసరం

కంప్లి, జూలై11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు దేశ సంప్రదాయాలపై అవగాహన అవసరమని ఎమ్మిగనూరు వామదేవ శివాచార్య స్వాములు అన్నారు. ఎమ్మిగనూరులో గురువారం రాత్రి గురుపౌర్ణమి సందర్భంగా వామదేవ శివాచార్యులు స్వామిని బాదనట్టి భక్తులు తులాభారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో పిల్లలకు పురాణ కథనాలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మిగనూరులో సిద్ధలింగ మహంత శివాచార్యులు స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెడు అలవాట్లకు దూరంగా వుండి ప్రశాంతమైన జీవితం కొనసాగించాలన్నారు. సమాజంలో ఏమి జరిగినా న్యాయమే గెలుస్తుందన్నారు. ఆశతో సంపాదించిన వారికి ఎన్నడూ ప్రశాంతత వుండదన్నారు. సగపాటుగా జీవించే వారు ఎక్కడైనా జీవించగలరన్నారు. ఇప్పుడున్న సమాజంలో అవినీతి, అన్యాయమే ఎక్కువైందని అన్నారు. కాస్తో కూస్తో ఇలా మాటలు ఉన్న చోట కొంతవరకు ధార్మిక, సంస్కృతిక కార్యక్రమాలు జరపడం వల్ల ఆ ప్రాంతంలో కొద్ది వరకు ప్రశాంతమైన జీవితం ప్రజలు కొనసాగిస్తారని తెలిపారు. నీటిపై బుడగతో సమానమైన మానవుడు మనతో వుండేవారిని సంతోషపరుస్తూ జీవితం కొనసాగించినప్పటికి వారికి ఎల్లప్పుడూ గుర్తింపు వుంటుందన్నారు. మంచి చదువులు, క్రమశిక్షణ నేర్పగలిగితే రాబోయే కాలంలో తల్లిదండ్రుల పేర్లు ఎప్పుడూ నిలబెడతాయన్నారు.

ఆహార శాఖ అధికారుల దాడులు

● కల్తీ సరుకుల పట్టివేత


పట్టుబడిన కల్తీ సరుకులు

రాయచూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి పట్టణం 27వ వార్డు గౌసియ మసీదు సమీపంలోని ఒక గోదాముపై ఆహార శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. గత కొంత కాలంగా ఈ స్టాక్ పాయింట్ నుంచి పెద్ద ఎత్తున కల్తీ ఆహార పదార్థాల రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న సింధనూరు, మాన్వి ఆహార శాఖ అధికారులు గురురాజ్, దేవరాజ్ సిబ్బందితో కలిసి జరిపిన దాడిలో 8.5 క్వింటాళ్ల మసాల తినుసులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.4.5 లక్షలకుపైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దాడి సమయంలో వ్యాపార నిర్వాహకులందరూ అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లగా గోదాము యజమానిని విచారించి ఆయన వద్ద నుంచి వారి వివరాలు సేకరించినట్లు ఆహార శాఖ అధికారి దేవరాజ్ తెలిపారు. పట్టుబడిన ఆహార పదార్థాల్లో పెద్ద మొత్తంలో మసాల తినుసులున్నట్లు గుర్తించారు. పసుపు, ధనియాలు, మిర్యాలు, రెడ్‌దాల్, శనగపప్పుతో పాటు నీలగిరి ఆకులు తదితర వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. ఆహార పదర్థాలను మసాల తినుసులను కల్తీ చేసేందుకు వినియోగించే రసాయనాలు అప్పటికే సిద్ధం చేసి ఉంచిన సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా అధ్యక్షుడిగా వీరేష్ మైలాపురం



కంప్లి, జూలై11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రక్షణ వేదిక స్వాభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడిగా వీరేష్ మైలాపూర్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణగౌడ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వీరేష్ మైలాపురం సిద్ధమ్మనహళ్లిలో విలేఖరులతో మాట్లాడుతూ రెండు రోజులు క్రితం బెంగళూరులో కర్ణాటక రక్షణ వేదిక స్వాభిమాన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారన్నారు. సమావేశంలో రాష్ట్ర పదాధికారులు తనను బళ్లారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకుని అర్హతపత్రం అందించారన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ హోదా కల్పించినదుకు కృతజ్ఞతలు తెలిపారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, జూలై 11(ఆంధ్రజ్యోతి): తాయమ్మదేవికి ఆషాఢ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణం ఆదోని రోడ్డులో వెలసిన తాయమ్మదేవిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు అమ్మవారికి పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.

ఇద్దరు పిల్లలు ముద్దు


మాట్లాడుతున్న వైద్యాధికారి దమ్మూరు బసవరాజు

సిరుగుప్ప, జూలై11(ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణ వల్ల కుటుంబం అభివృద్ధి బాటలో నడవడానికి సాధ్యపడుతుందని తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ దమ్మూరు బసవరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకరు లేక ఇద్దరు పిల్లలు ఉండాలని అన్నారు. ఎక్కువ మంది పిల్లలకు ఆస్కారం ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. కుటుంబ ఆర్థిక పురోగతి చెందాలంటే అధిక పిల్లలు కలిగి వుండరాదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహమ్మద్ ఖాసీమ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌తో వ్యాపారుల భేటీ


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, వ్యాపారులు

రాయచూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మహానగరపాలక కమిషనర్‌తో శుక్రవారం వ్యాపారులు ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. రాయచూరు ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ అసోసియేషన్ తరఫున ప్రతినిధులు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ నేతృత్వంలో వెళ్లి కమిషనర్‌తో చర్చించారు. నగరసభ అప్‌గ్రేడేషన్ అనంతరం అన్ని రకాల వ్యాపారాలకు ఖచ్చితంగా లైసెన్స్‌లు ఉండాలని అధికారులు నోటీసులు ఇస్తున్నారని ఈ విషయంలో తమకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి వ్యాపారులు కమిషనర్‌కు వివరించారు. దీంతో పాటు ఇప్పటికే అమలులో ఉన్న చట్టాలు తదితర వాటి గురించి వారు కమిషనర్‌కు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నందున ప్రజలు సంతోషంగా ఉన్నారని, అదే సమయంలో కొత్త చట్టాల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దన్నారు.

హోసూరు జోన్

ప్రత్యంగిరాదేవికి పౌర్ణమి పూజలు


విశేష పూజల్లో పాల్గొన్న భక్తులు

హోసూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన మోరనపల్లిలోని రాహుకేతు అథర్వణ మహా ప్రత్యంగిరాదేవి ఆలయంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని గురువారం రాత్రి విశేషహోమాదికాలు నిర్వహించారు. దుష్టశక్తుల పీడలు తొలగాలని కోరుతూ నిర్వహించే హోమంలో ఎండు మిరపకాయలు వాడడం విశేషం. తిరువణ్ణామలై మాజీ ఎమ్మెల్యే కలసప్పక్కం డీ పన్నీర్‌సెల్వం, అన్నాడీఎంకే జిల్లా జాయింట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు. స్థానికులే కాకుండా సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పుస్తకోత్సవం ప్రారంభం


పుస్తకోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): హోసూరు - బెంగళూరు జాతీయ రహదారిలోని మూకొండపల్లి సిప్‌కాట్ ప్రాంతంలోని హోటల్ హిల్స్ కన్వెన్షన్ హాల్‌లో 12రోజుల పాటు కొనసాగే పుస్తకోత్సవాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. 110 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటలనుంచి రాత్రి 9వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. 10శాతం తగ్గింపుతో పుస్తకాలు కొనుగోలు చేయవచ్చునన్నారు. 14వ హోసూరు పుస్తకోత్సవ సమన్వయకర్త డాక్టర్ సేతురామన్ సహా పలువురు పాల్గొన్నారు. అనేకమంది స్వచ్ఛంద సంస్థల సహాయంతో విద్యార్థులు తమకు కావాల్సిన పుస్తకాలను రూ.50 విలువైన కూపన్ల ద్వారా ఉచితంగా ఇవ్వనున్నారు. పుస్తకోత్సవంలో మహిళలకు చర్చావేదిక, పాటల పోటీ సహా పెయింటింగ్ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. 19న ఫొటోగ్రఫీ పోటీలు, 20న చదరంగం పోటీలు నిర్వహించనున్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

హోసూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో ఇద్దరు గాయపడ్డారు. భవన నిర్మాణ కార్మికుడు ఈశ్వర్ కుమారుడు మూడో తరగతి రామ్‌చరణ్ గురువారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చాక ఆటలాడుతుండగా కుక్క కరిచింది. తల, వీపు, చెవులు, ముక్కు తదితర చోట్ల గాయాలయ్యాయి. అతడిని ఆసుపత్రికి తరలించగా రామ్‌చరణ్‌కు 40 చోట్ల కుట్లుపడ్డాయి. హోసూరు దర్గా ప్రాంతంలోని ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్న ముత్తులక్ష్మి (25) తేరుపేట ప్రాంతంలో బైక్‌పై వెళ్తుండగా వీధికుక్క వెంబడించి కరిచింది. కాలికి గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఇటీవలే ఎడ్విన్ ప్రియన్ అనే వ్యక్తి కుక్కకాటుతో మృతి చెందిన విషయం విదితమే. కుక్క దాడులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి

రాయచూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముదగల్ పట్టణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యాపారి మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ప్రతి ఏటా మొహర్రం పండుగ సందర్భంగా ముదగల్ పట్టణానికి వస్తున్న ఈ వ్యాపారి స్వతహాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందినవాడని పోలీసులు తెలిపారు. సందీప్ సింగ్(36) అనే వ్యక్తి 15 ఏళ్లుగా మొహర్రం సందర్భంగా గోబీ మంచూరీ దుకాణం నిర్వహించేవాడని, ఈ ఏడాది కూడా గురువారం రాత్రి కూడా షాపు నిర్వహించేందుకు నేరుగా విద్యుత్ లైన్‌కు వైరు వేసే క్రమంలో షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ముదగల్ ఎస్ఐ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.